


**కళకళలాడుతూ ఉంది** పెళ్ళి పందిరి. "పెళ్ళాడు పెళ్ళాడు అందరాయా" పాటను ఆనందంగా వాయిస్తున్నారు బాండు వాళ్ళు. మండపంలో కూర్చుని ఉన్న పెళ్ళికొడుకు మోహన్ క్షణానికి ఓ సారి ఎదురుగా ఉన్న తెరవంక చూస్తున్నాడు. పెళ్ళికూతురు రోజీ సిగ్గుతో తల వంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూంది.

ఇద్దరి వెనకాలా చేరారు వారి వారి స్నేహితులు. ముహూర్తం సమీపించింది. బెల్లం, జీలకర్రా పెట్టారు. మంగళసూత్ర ధారణ అయిపోయింది. తలంబ్రాల కార్యక్రమం దగ్గర పడింది. పెళ్ళికొడుకు వెనకాల చేరిన కుర్రకారు ఉత్సాహం మిన్ను ముట్టింది. "ఒరేయ్ మోహన్! ఇప్పుడు చూపించాలి నీ తడాఖా" అంటూ పెళ్ళికొడుకుని ప్రోత్సహిస్తున్నారు. రోజీ వెనక ఉన్న అమ్మాయిలు అంతకన్నా నాలుగాకులు ఎక్కువ చదువుకున్నట్లు, "ఒ, సేయ్ రోజీ! ముందూ వెనకా చూడకు. పురోహితుడు సిగ్నల్ ఇవ్వగానే పళ్ళెం ఎత్తిపో సెయ్" అంటూ అల్లరి చేస్తున్నారు. "మరీ మండపం చుట్టూ దడి కట్టేశారేవిట్రా. కాస్త పక్కకి తప్పుకోండి" అంటూ మందలిస్తున్నారు పెద్దవాళ్ళు. "మీ గోల బంగారంగానూ! వాళ్ళని తాపీగా పెళ్ళిచేసుకోనీయండి" అని బ్రతిమలాడుతున్నాడు పురోహితుడు. అయినా, వీళ్ళ గోల వీళ్ళదిగానే ఉంది. తలంబ్రాలు మొదలయ్యాయి.

"మోహన్! క్విక్", "రోజీ! కానీ" అంటూ కేకలు కేరింతలు తారస్థాయి నంటాయి. నగందాకా తనదే పైచేయి అనిపించుకున్న మోహన్ హఠాత్తుగా బుద్ధి మార్చుకుని బుద్ధిగా సరెండర్ అయిపోయాడు. ఆ అవకాశం తీసుకుని వెంటనే పళ్ళెం ఎత్తిపో సేసింది రోజీ. అప్పటిదాకా కేరింతలు కొడుతున్న మోహన్ స్నేహితులు నీరుగారిపోయారు. "ఓరి నీ దుంపతెగా! కొంప ముంచేశావు కదరా" అని విసుక్కున్నాడు ఓ ప్రబుద్ధుడు. అమ్మాయిల ఉషారు చెప్ప నలవి కాదు. "శభాష్ రోజీ" అని మెచ్చుకున్నారు. అబ్బాయిల బృందంలోనించి ముందుకి వచ్చి మోహన్ భుజం తట్టాడు మాధవ్. "వెరీ గుడ్, బ్రదర్!" ముందు జీవితంలో కూడా భార్యకు సమాన హక్కు లిచ్చి గౌరవిస్తానని చూపించుకున్నావు. ఎలా అయినా నీది మంచి మనసు. నీ ఆదర్శం గొప్పది" అన్నాడు హీరోలా పోజిచ్చి. "నిజమే! మంచి పని చేశావు. ఎలా అయినా మావాడి మనసు వెన్న" అంటూ అతనికి వంత పాడారు మిగిలిన వాళ్ళు. ఇది గమనిస్తున్న అమ్మాయిలకి ఒళ్ళు మండింది. "సిగ్గులేకపోతే సరి. ఓడిపోయి ఆదర్శాలూ, సింగినాదాలూ అంటూ సమర్థించుకుంటున్నారు." నేరుగా విమర్శించింది గాయిత్రి.

చివాల్న తలెత్తి అటు చూశాడు మాధవ్. పొడువాటి జడ- భుజం మీదుగా ముందుకి వేసుకుని రోషంగా చూస్తూ కనపడింది బాపూ బొమ్మ. ఆవిడకి తగిన సమాధానం చెప్పాలని నోరు విప్పేలోపలే ఎవరో భుజం తట్టి, "పక్కకు తప్పుకోండి" అనడంతో పక్కకి తొలగి దారిచ్చాడు. తలంబ్రాలు అయిపోవడంతో మండపం దగ్గర చేరిన గుంపు చెదిరి తలో దిక్కుకు వెళ్ళిపోయారు. "ఎవరా సిమ టపాకాయ?" తీరిగ్గా కుర్చీలో చేరబడి కూర్చుని పక్కనే ఆశీనుడై ఉన్న పెళ్ళికొడుకు తమ్ముడిని ప్రశ్నించాడుమాధవ్. "ఏ సిమ టపాకయ!" ఆశ్చర్యంగా అడిగా డతను. "ఇందాక మండపం దగ్గర మీ వదిన వెనకాల నిలబడిందే ఆ అమ్మాయి!" వివరించాడు మాధవ్. "ఏమో నేను చూడలేదు." అనేశా డతను. అంతలో దూరంగా కనిపించింది ఆ అమ్మాయి. చుట్టూ మరో నలుగురు అమ్మాయిలున్నారు. పాకెట్లు పంచుతున్నారు. "అదుగో ఆ అమ్మాయి" అంటూ చూపించాడు. "ఆ అమ్మాయా?! ఆడ పెళ్ళి వారి వైపు వచ్చినట్లుంది" అన్నాడు అతను. ఒళ్ళు మండింది మాధవ్ కి." నీ తలకాయ లేవేయ్. ఆ మాత్రం నాకూ తెలుసు. నా క్కావలసింది ఆ అమ్మాయి వివరాలు- పేరూ ఊరూ చదువూ సంధ్యా..." అంటూ ఉండగానే అతనికి చేరువగా వచ్చారు ఆ అమ్మాయిల బృందం.

ఈ శత మర్కటాల గుంపును చూసి మూతి విరిచి పక్కనించి తప్పుకుని ముందుకి వెళ్ళారు అమ్మాయిలు. "ఏమిటిది... ఈ ఆడపెళ్ళివారికి బొత్తిగా మంచీ మర్యాదా తెలిసినట్లు లేదే? పెళ్ళికొడుకు స్నేహితులం. పెళ్ళికొడుకు తరవాత పెళ్ళికొడు కంతటి వాళ్ళం. మాకు ఇవ్వకుండా వెళిపోతున్నారేం?" అన్నాడు మాధవ్ పెద్దగా. గాయిత్రి ఆగిపోయింది. "ఈ పెళ్ళికొడుకు స్నేహితులకు పెళ్ళిమీదకంటే ఫ్రీగా భోజనం చెయ్యటం మీదే ఎక్కువ ఇంట్రస్టు ఉన్నట్లుంది" అంది అంతకంటే పెద్దగా. ఆ పక్కనున్న పెళ్ళి పెద్ద ఆ మాటలు విని పరుగున వచ్చాడు. "గాయిత్రీ! ఏమి టా వాగుడు? మంచీ మర్యాదా ఉండద్దూ!" అని కసిరి పెళ్ళికొడుకు ఫ్రెండ్స్ దగ్గిరికి వెళ్ళి, "ఏదో చిన్న పిల్ల... దూకుడు స్వభావం, బాబూ! మరేమీ అనుకోకండి" అంటూ క్షమాపణ చెప్పుకున్నాడు. ఆ వెంటనే కవర్లు స్వయంగా అందించి- "మీ కేం కావాలన్నా నిర్మొహమాటంగా అడగండి. దాని మాటలు పట్టించుకోకండి" అని మరోసారి చెప్పాడు. "అలాగే లేండి. చిన్న పిల్లలు ఏదో అంటూనే ఉంటారు. మనం పట్టించుకుంటే ఎలా?" అన్నాడు మాధవ్, ఓరకంట గాయిత్రి వంక చూస్తూ. పళ్ళు కొరుక్కుని ఈడియట్ అని తిట్టుకుంటూ వెళ్ళిపోయింది గాయిత్రి.

లగ్నం అయిపోయింది. డిన్నరూ అయిపోయింది. అంతా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. పురోహితుడు నూతన దంపతులను కూర్చోపెట్టి స్థాళీపాకం కార్యక్రమం జరిపిస్తున్నాడు. మాధవ్, మరో ముగ్గురు స్నేహితులు కుర్చీలు వేసుకుని అక్కడే కూర్చుని పెళ్ళికొడుక్కి కంపెనీ ఇస్తున్నారు. "అమ్మా! మంగళహారతి తీసుకు

'జయంతి'

# స్వయం వరం





రండి" అన్నాడు పురోహితుడు. పెళ్ళికూతురి తల్లి లేచి వెళ్తూ పక్కనున్న అమ్మాయితో. "గాయత్రిని పిలు- మంగళహారతి పాడుతుంది" అని చెప్పి వెళ్ళింది. పది నిమిషాల తరవాత కళ్ళు నులుముకుంటూ వచ్చింది గాయత్రి. ఇందాకటి పట్టు చీర మార్చి ఆర్గండీ చీర కట్టుకుంది. ఇందాకటికంటే అందంగా ఉన్న ఆ అమ్మాయి వంక కుతూహలంగా చూశాడు మాధవ్. మంగళహారతి వెలిగించి తీసుకొచ్చింది రేణు తల్లి. "వచ్చావుటే... ఓ మంగళహారతి పాడు" అంది గాయత్రిని చూసి. సగం నిద్రలో లేచి వచ్చిన గాయత్రి అప్పుడు చూసింది కుర్చీలో కూర్చున్న మాధవ్‌ని.

వాళ్ళందరి ముందూ పాడడానికి మొహమాటం వేసింది. "అబ్బే ఇప్పుడేం పాట పిన్నీ!" అంది విసుగ్గా. "ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? పాడు" అందావిడ. 'నా గొంతు బాగా లేదు' అని సాకు చెప్పింది గాయత్రి. "మరేం ఫర్వాలేదులే... ఏదో ఓ ముక్క పాడు చాలు. నీకేం మొదట్నుంచి ఇవ్వటం లేదుగా" అంది ఆవిడ. ఇక తప్పనట్టు వచ్చి పళ్ళెం పట్టుకుంది. ఏం పాట పాడాలా అని ఆలోచన మొదలు పెట్టింది. "అమ్మాయ్! త్వరగా పాడమ్మా. అర్ధరాత్రి దాటింది. మాకు నిద్ర లొస్తున్నాయి" అంటూ తొందర చేశాడు పురోహితుడు. "గాడిద లొస్తాయని భయం కాబోలు" అన్నాడు మాధవ్. "ఓహోహో" అని నవ్వారు అతడి స్నేహితులు. "ప్రత్యేకంగా రాహాలా... ఇప్పుడున్నవి చాలవు?" అంది గాయత్రి. వాళ్ళ నోళ్ళు టక్కున మూతపడ్డాయి. పెళ్ళికూతురు కిసుక్కున నవ్వింది. పురోహితుడూ నవ్వేశాడు. "కానియ్యమ్మా పాట పాడు" అన్నాడు నవ్వుతూనే. ఏదో మంగళహారతి పాడేసింది గాయత్రి. హారతి కళ్ళ కద్దారు. "శతమానం భవతు" అంటూ అక్షింతలు జల్లి, "ఇక లేవండి నాయనా" అంటూ బ్రహ్మముడులు విప్పేశారు పురోహితుడు. 'అమ్మయ్య' అంటూ లేచి పక్కనున్న భార్యకు గుడ్‌నైట్ చెప్పేసి ఒళ్ళు విరుచుకుంటూ వెళ్ళిపోయాడు పెళ్ళికొడుకు. అతని వెంటే వెళ్ళారు మిగిలినవాళ్ళు. "గాయత్రీ !ఆ వెండి సామాన్లు తీసి పెట్లో పెట్టమ్మా" అని చెప్పి, కూతుర్ని తీసుకుని లోపలికి వెళ్ళింది పెళ్ళికూతురి తల్లి.

ఆ పని పూర్తి చేసి ఇవతలికి వచ్చేసరికి ఎదురయ్యాడు మాధవ్. "మోహన్ వాచీ ఇక్కడ అలమార్లో పెట్టాడుట. తెమ్మన్నాడు." అడక్కుండానే చెప్పేశాడు.

'ఓ' అంటూ లోపలికి వెళ్ళి వాచీ తెచ్చి ఇచ్చింది గాయత్రి.

"గాయత్రిగారూ! పాట బాగానే ఉంది. కొంచెం శ్రుతి ఎక్కువైంది. అది తగ్గితే ఇంకా బాగుండేది" అన్నాడు మాధవ్, వాచీ జేబులో వేసుకుని గాయత్రి వెంట నడుస్తూ. సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతున్న గాయత్రికి- "అదేమిటండీ! సమాధానం చెప్పరేం?" అన్నాడు మళ్ళీ. వినిపించుకోలేదు గాయత్రి. "పోనీ మీరూ ఏదైనా మాట్లాడవచ్చుగా. మీ పేరేమిటండీ అని అడగవచ్చుగా" అన్నాడు కొంచెం కినుకగా. చివాల్న వెనక్కు తిరిగి చిన్నగా నవ్వింది గాయత్రి. "అడగాలా ఏమిటండీ? ఆ మాత్రం ఊహించుకోలేనూ- హనుమంతరావో, ఆంజనేయులో అయి ఉంటుంది మీ పేరు" అనేసి చరచర వెళ్ళిపోయింది. నోరావలించి ఉండిపోయాడు మాధవ్.

×× ×× ××

విశాలమైన గది. దానిమధ్య మంచం. తెల్లటి దుప్పటి. మల్లెపూలు. మంచంమీద కూర్చుని ఉంది గాయత్రి. మెల్లిగా ఆ గదిలోకి వచ్చాడు మాధవ్. గాయత్రి పక్కనే కూర్చుని "గాయత్రీ" అంటూ భుజంమీద చెయ్యి వేశాడు. చివాల్న తల ఎత్తి చూసింది గాయత్రి. "నేను పాట పాడతా" అంది. తెల్లబోయాడు మాధవ్. "ఏమిటీ... పాట పాడతావా?" "అవునూ... ఏం? నాకు పాటలు రావా?"

"వచ్చు... నీకు రాకపోవటం ఏం?లతామంగేష్కర్‌లా పాడతావు. కానీ, ఇప్పుడు పాటెందుకు చెప్పు. మాట్లాడు చాలు."

"కాదు... నేను పాటే పాడతా. ఆ వేళ రోజీ పెళ్ళిలో నేను మంగళహారతి పాడితే శ్రుతి బాగా లేదని వెక్కిరించారుగా. ఇప్పుడు సరిగ్గా పాడతా."

"అదా! అప్పుడేదో సరదాకి అన్నాను. అప్పుడు నువ్వు చాలా బాగా పాడావు!"

"అయినా సరే- ఇప్పుడు మళ్ళీ పాడతా."

"సరే ఏదో పాడు." విసుగ్గా అన్నాడు.

"ఏడవకు. పాడతా."

"ఊ త్వరగా పాడు"

"లే లే లే లేలే నా రాజా!" పాట మొదలు పెట్టింది గాయత్రి. కంగారుగా చూశాడు మాధవ్. 'ఏయ్ ఏమిటిది? మతి పోయిందా! ఛండాలంగా ఆ పాటేమిటి? వినేవాళ్ళు ఏమనుకుంటారు? ఇంకేదైనా పాడు" అన్నాడు.

"అహా ఇదే నా ఫేవరేట్ సాంగ్. ఇదే పాడతా." మొండికేసింది గాయత్రి.

"సరే ఏదో ఏడు. కాస్త మెల్లిగానైనా పాడు" అన్నాడు పళ్ళు కొరుక్కుంటూ. "ఊహూ ఈ పాట ఈ శ్రుతిలోనే పాడాలి. "లే లే లే లేనా రాజా" తారస్థాయిలో పాడుతోంది. బయట నవ్వులు. కేకలు. హేళనలు. ఒళ్ళు మండిపోతోంది మాధవ్‌కి. "గాయత్రీ! ఇక ఆపు. అందరూ నవ్వుతున్నారు" అన్నాడు. ఫలితం శూన్యం. "నిద్దుర లేవనంటవా?" అంటూ మరింత గొంతు హెచ్చింది గాయత్రి.

"నోరు మూసుకో. నోరు మూసుకో." పెద్దగా అరిచాడు మాధవ్.

మరుక్షణం అతని వీపుమీద విమానం మోత మోగింది.

"అబ్బా" అంటూ లేచి కూర్చున్నాడు మాధవ్. ఎండ ముఖాన పడుతోంది. ఎదురుగా అతని ఫ్రెండ్ మురళి. అయోమయంగా చూశాడు అతని వంక. "ఏరా! వదిలిందా నిద్ర మత్తు. పెళ్ళివారు టిఫిన్లు పంపించారు. నీకు ఇడ్లీలు చల్లారితే సహించవు కదా, పోన్లే పాపం అని నిద్ర లేపడానికి వస్తే, నోరు మూసుకో... నోరు మూసుకో అని తిడతావుట్రా రాస్కెల్!" అన్నాడు మురళి. నిద్ర మత్తు పూర్తిగా వదిలి పోగా చుట్టూ చూశాడు మాధవ్.


**THIS IS SUCCESS !**

**87% విద్యార్థులకు Ist క్లాస్ !**

**1985 ఏప్రిల్ పరీక్షలో వీరందరూ మా**

**10వ తరగతి గణితశాస్త్ర బోధిని**

అభ్యసించారు. విజయపథంలో సాగే విద్యార్థులతో మీరూ చేరండి! 10వ తరగతి విద్యార్థులు గణిత శాస్త్రంలో స్వయంగా ప్రావీణ్యం సంపాదించడానికి మా పోస్టల్ ట్యూషన్ చక్కటి సాధనం. వివరాలకు

వ్రాయండి :

**నర్సరీ టీచర్ ట్రైనింగ్**

నర్సరీ టీచర్లకు మాంటెస్సోరీ బోధనా విధానంలో కరస్పాండెన్స్ కోర్సు. ఆదర్శ ఉపాధ్యాయులు అనుసరించవలసిన విధానాలు, పాటించవలసిన పద్ధతులు, గమనించవలసిన మెలకువలు, ఉపయోగించవలసిన సాధనాలు. వివరాలకు వ్రాయండి :

**ప్రవీణ్ పబ్లిషింగ్ హౌస్**

7-9-23, సాంబమూర్తి వీధి,

రామారావు పేట, కాకినాడ-533 004.

చుట్టూ ఉన్న మంచాలు ఖాళీగా ఉన్నాయి. అందరూ లేచారు. తనొక్కడే ఇంకా పడుకున్నాడు. అంతలో కల గుర్తొచ్చింది. సిగ్గు వేసింది. చివాల్న లేచి పరిగెట్టాడు. స్నానం చేసి తయారై వచ్చాడు. పెళ్ళికొడుకు చుట్టూ ఆశీనులై ఫలహారాలు సేవిస్తూ- "ఒరేయ్! ఏమిటి కబుర్లు? మీ మిసెస్ ఏమంటూంది- చెప్పరా?" అంటూ వేధిస్తున్నారు ఫ్రెండ్సందరూ. తనూ వెళ్ళి వాళ్ళ పక్కనే కూర్చున్నాడు మాధవ్. "ఏమీ మాట్లాడలేదురా. ఏదో నే నడిగిన దానికి సమాధానం చెప్పి ఊరుకుంటుంది. అంతే. అయినా ఎలా మాట్లాడుతుంది? మా చుట్టూ ఈగల్లా ఒకటే జనం." తన గోడు వెళ్ళబోసుకుంటున్నాడు మోహన్। ఇంకెంత సేపురా, నాయనా! కాస్త ఓపిక పడితే పెళ్ళి భోజనం చేసి మాదోవన మేమ్ పోతాం. మరి కాస్త ఓపిక పడితే సాయంత్రం అవుతుంది. ఇంకాస్త ఓపిక పడితే రాత్రి అవుతుంది. ఇహ అప్పుడు నువ్వూ, మీ ఆవిడా తనివితీరా కబుర్లు చెప్పుకుందురు గాని." నాటక ఫక్కీలో ఓదార్చాడు మోహన్. మళ్ళీ తన కల గుర్తు వచ్చింది మాధవ్‌కి. తల వంచుకుని నవ్వుకున్నాడు. "వాడంటే కొత్త పెళ్ళికొడుకు కాబట్టి ఆనందపడ్డా అర్థం ఉంది. నీకెందుకు, తండ్రీ, ఇంత ఆనందం?" నిలదీసి అడిగాడు ఒక స్నేహితుడు. సమాధానం చెప్పలేక మరింత నవ్వేసి ఇవతలికి వచ్చేశాడు మాధవ్.

విడిది ఇచ్చిన ఇల్లు ఈ మధ్యనే కట్టారేమో కొత్త మోడల్‌లా ఉంది. మేడమీద పెళ్ళికొడుకు స్నేహితులు మజిలీ చేశారు. మందలోంచి బయటికి వచ్చి నిలబడిన మాధవ్, పరిచితమైన కంఠం వినిపించడంతో అటు చూశాడు. లేత నీలం కాశ్మీరు సిల్కు చీర కట్టుకుని అందాలు ఒలికిస్తున్న గాయిత్రి కనిపించగానే పురి విప్పిన మయూరంలా గంతులు వేసింది అతని హృదయం. లోపలికి వెళ్ళి ఫలహారాలు సరిపోయాయో లేదో కనుక్కుంది గాయిత్రి.

"టిఫిన్లు చాలు. కాఫీ మరి కొంచెం పంపించండి. చూడండీ. పంచదార కొంచెం తగ్గించి, బాగా వేడిగా తెప్పించండి" అని చెప్పాడు పెళ్ళికొడుకు. "సరే" అంటూ ఇవతలికి వచ్చిన గాయిత్రికి మేడ దిగి వెళ్ళాలంటే బద్ధకం వేసింది. టెర్రేస్ మీదికి వెళ్ళి పిట్టగోడ దగ్గరి్నుంచి వంగి చూసి, "ఒరేయ్ శ్రీనూ!" అని కేకేసింది. పదేళ్ళ కుర్రాడు- అక్కడ ఆడుకుంటున్న వాడు తలెత్తి చూశాడు- "లోపల లక్ష్మి ఉంది పిలు" అని చెప్పింది. అలాగే అని లోపలికి వెళ్ళాడు వాడు.

తనకి కాస్త దూరంలో నిలబడిన గాయిత్రిని చూస్తుంటే పరాయి పిల్లను చూస్తున్నట్లు అనిపించలేదు మాధవ్‌కి. పుట్టింట్లో ఉన్న భార్యలా అనిపించింది.

"గుడ్ మార్నింగ్" అని విష్ చేశాడు. తల తిప్పి అతన్ని చూసి చిన్నగా నవ్వి, "గుడ్ మార్నింగ్" అంది గాయిత్రి. "పాపం బాగా అలిసిపోయినట్లున్నారు." పరామర్శించాడు. "ఆ! అలసటే మరి. హాయిగా కూర్చోడానికి మేము మగపెళ్ళివాళ్ళమా!" అలసటగా అంది గాయిత్రి. "నిజమే పాపం. ఇంతకీ పెళ్ళికూతురు మన కేమౌతుంది?"

"మా బాబాయి కూతురు."

"ఆ విషయం నేను గ్రహించాను లెండి. మీకు ఆవిడ అక్కా, చెల్లెలా?" మళ్ళీ అడిగాడు.

"అదీ, నేనూ ఒకే వయసు వాళ్ళం." సమాధానం చెప్పింది.

బరువుగా నిట్టూర్చాడు మాధవ్. "నాకూ, మా మోహన్‌కీ ఒకటే వయసు. ఇంకా నేనే ఆర్నెల్లు పెద్ద వాడికన్నా! వాడికి హాయిగా పెళ్ళయిపోయింది. ఇక నాకు ఎప్పుడవుతుందో!" దీనంగా అన్నాడు.

కోపంగా చూసింది గాయిత్రి. "మీ కేం మగవాళ్ళు? లక్షణంగా పెళ్ళయిపోతుంది. మీ రేమైనా పెళ్ళి చూపుల్లో పాటలు పాడలా డాన్సు చెయ్యాలా? హాయిగా కూర్చుని కమ్మగా టిఫిన్ తింటే చాలు. మీకు నచ్చిన పిల్ల నిచ్చి, డబ్బు లిచ్చి మరీ పెళ్ళి చేస్తారు మీకు" అంది కసిగా. అల్లరిగా నవ్వి, "అది మా అదృష్టం! అన్నాడు మాధవ్.

గయ్‌మని లేచింది గాయిత్రి: "సిగ్గులేకపోతే సరి" అంది మరింత కసిగా. మరింత అల్లరిగా నవ్వాడు మాధవ్. "బాగుంది. సిగ్గెందుకు? అమ్మాయిల్ని పెళ్ళిచూపుల్లో ప్రశ్న లడగద్దని మే మేమైనా రూల్ పెట్టామా? మీరూ అడగచ్చుగా. పాటలు పాడండి. డాన్సు చెయ్యండి అని మీరూ అడగండి" అన్నాడు.

"మా అదృష్టం బాగుండి ఆ రోజులు రావాలే కానీ, పెళ్ళికొడుకులని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాం." పౌరుషంగా అంది గాయిత్రి.

"అబ్బో! చాలా మంచి భావాలే ఉన్నాయన్నమాట మీకు. రేపు మీ పెళ్ళి చూపుల్లో ఆ పెళ్ళికొడుకు- చూడండి 'పెళ్ళికూతురుగారూ! మీ ఇష్టం వచ్చిన ప్రశ్నలు అడగండి' అన్నా డనుకోండి. ధైర్యంగా అడిగేస్తారా?" కుతూహలంగా అడిగాడు.

"అడగటం ఏమిటి? కడిగేస్తాను. ఆ పెళ్ళికొడుకు అడగమని అడక్కుండానే అడిగేస్తాను." పెంకిగా సమాధానం చెప్పింది.

"ఏం ప్రశ్నలు అడుగుతారు..." పాట పాడమంటారా?! మరింత క్యూరియాసిటీతో అడిగాడు.

"అంత తేలిగ్గా వదల్ను" అంది.

"అంటే?" రెట్టించాడు.

"మీ కెందు కా క్యూరియాసిటీ? మీరు ఆ పెళ్ళికొడుకు కాదుగా!" కొట్టిపారేసింది.

"కాదని ఎందు కనుకోవాలి. సరదాకి నేనే పెళ్ళికొడుకు ననుకోండి. మీరే పెళ్ళికూతురుగారు. మిస్ గాయిత్రీ! మిమ్మల్ని పెళ్ళి చేసుకోవటం నాకిష్టమే! మిమ్మల్ని చేపట్టాలంటే నేనేం చేయాలి అని అడిగా ననుకోండి. మీ రేం చెప్తారు?" సూటిగా అడిగాడు.


మింగేసేలా చూసింది అతని వంక. అంతలోనే ప్రసన్నత తెచ్చిపెట్టుకుని, "ఈ మేడమీద నుండి కిందికి దూకండి అంటాను" అంది చిలిపిగా. అంతే మరుక్షణం కెవ్వున కేక వేసింది.

× ×

ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో స్పెషల్ రూమ్‌లో బెడ్‌మీద పడుకుని ఉన్నాడు మాధవ్. ఎడమ కాలికి ప్లాస్టర్ వేసి బరువు కట్టి వేలాడదీశారు. మంచం పక్కనే కూర్చుని ఉంది అతని తల్లి. అంతలో గుంపుగా లోపలి కొచ్చారు ఫ్రెండ్స్. చిన్నగా నవ్వాడు మాధవ్. అది చూసి ఆనందపడ్డారు వాళ్ళు. అమ్మయ్య. "ఈ పూట బాగానే ఉన్నావు. నిన్న నీ బాధ చూసి జాలి వేసింది మాకు. బలవంతాన ఇళ్ళకివెళ్ళామే కానీ, నిద్రలు లేవు" అన్నారు.

"సారీ రా! మిమ్మల్నందర్నీ శ్రమ పెట్టేశాను" అన్నాడు మాధవ్ గిల్టీగా. "మరేం ఫరవాలేదులే" అనేశారు వాళ్ళు. "అబ్బాయ్! నేను ఇంటి కెళ్ళి స్నానం చేసి, నీకు భోజనం పట్టుకొస్తాను. ఈ పూట అన్నం పెట్టమన్నారు డాక్టర్‌గారు" అంటూ లేచింది అతని తల్లి. "అలాగే వెళ్ళిరామ్మా" అన్నాడు మాధవ్. ఆవిడ వెళ్ళిపోయింది. అప్పటిదాకా ఏదో ఊసుబోక కబుర్లు మాట్లాడుతున్న స్నేహితులంతా ఆవిడ నిష్క్రమణంతో కుతూహలంగా మంచంచుట్టూ చేరారు.

"ఒరేయ్! అసలేమైందిరా? అప్పటిదాకా లక్షణంగా మా దగ్గిరే కూర్చుని కబుర్లు చెబుతున్నవాడివి బయటికి ఎప్పుడు వెళ్ళావు? పోనీ వెళ్ళినవాడివి ఊరకే ఉండక మేడమీదనుంచి ఎందుకు దూకావురా?" అని అడిగా డొకతను. తల వంచుకుని ఊరుకున్నాడు మాధవ్. "నిన్నటినుంచి సస్పెన్స్‌తో చచ్చిపోతున్నాం. చెప్పరా! చెప్పరా..."



అంటూ బతిమాల సాగారు. వాళ్ళు తన కోసం తెచ్చిన ఆపిల్‌పండు తింటూ చిన్నగా నవ్వాడు. అంతలో రూమ్ తలుపు తెరుచుకుంది. అంతా అటు చూశారు.

వెంకట్రావు లోపలికి వచ్చాడు. తండ్రిని చూడగానే నిటారుగా కూర్చున్నాడు మాధవ్. తను తెచ్చిన ప్లాస్టిక్ బుట్ట పక్కన పెట్టి, "ఎలా ఉందిరా?" అడిగాడాయన. "బాగానే ఉందండీ." వినయంగా సమాధానం చెప్పాడు. "హార్లిక్స్ తాగుతావా?" కఠినంగానే అడిగాడాయన. "వద్దండీ!" వినయంగా చెప్పాడు" మాధవ్.డా అంటూ.

బయటికి వెళ్ళి అక్కడున్న చెక్క బెంచీ మీద కూర్చున్నాడు. పక్కనే ఎవరో ఇద్దరు మనుషులున్నారు.

"కలికాలం, బాబూ, కలికాలం... ప్రతివాడికీ తల తిక్క ఆలోచన్లే! ఈ శుంఠని చూడండి... ఉట్టి పుణ్యానికి కాలు విరగ్గొట్టుకుని కూర్చున్నాడు. ఈ కాలం పిల్లలే హమ్మో. రోజూ తినే సూపర్ వేసిన తిండి ప్రభావమో, ఏమోకానీ అతి తెలివి తప్ప అసలు తెలివి ఉండడం లేదు. నా కొడుకునే చూడండి. స్నేహితుడి పెళ్ళి కెళ్ళాడు. బాగానే ఉంది. అయిదో పదో చదివించి, పెళ్ళి భోజనం చేసి చక్కా రాక మేడమీదనించి దూకటం ఎందుకు చెప్పండి, తిన్నది అరగక కాకపోతే? ఏదో ఇంకా నయం. ఆ మేడ బాగా ఎత్తు తక్కువ కావటంతో కాలు విరగడంతో సరిపోయింది. ఇప్పటికి ఇదే అదృష్టం. అసలైనా ఇదంతా నా ఖర్మ. ఒక్కడే కొడుకు కదా అని నా భార్య బాగా ముద్దు చేసింది. వీడు కాస్తా మొద్దై కూర్చున్నాడు."

ఆ సమయంలోనే ఆ వరండాలోకి వచ్చాడు ఒక పెద్ద మనిషి. ఆయనకీ ఇంచుమించు వెంకట్రావు వయసే ఉంటుంది. నంబర్లు వేసి ఉన్న రూమ్‌ల వంక చూస్తూ వస్తున్న వాడల్లా వెంకట్రావు మాటలు విని తిన్నగా అక్కడికి వచ్చేశాడు.

"పైగా ఈ వెధవని ఏమిట్రా అని అడిగితే ఏమంటాడో తెలుసా? ఆ అమ్మాయి తనకి నచ్చిందట. రేపు పెళ్ళి చూపుల్లో పెళ్ళి కూతురు గంగలో దూకమం దనుకో దూకుతావా అని అడిగిందిట. ఎవరో అడగటం దాకా ఎందుకు ?నువ్వు అడిగావుగా ఇదుగో దూకేస్తున్నా అని దూకేశాడుట. తెలివి తక్కువ వెధవ ఎక్కడో. కన్న కొడుకనే మమకారంవల్ల ఊరుకున్నానుగానీ ,లేకపోతే ఆ రెండో కాలు నేనే విరగొట్టే వాడిని. మా రోజుల్లో మేము ఇలా ఉండేవాళ్ళం కాదు." ఎక్కడా కామాలూ, ఫుల్‌స్టాపులూ లేకుండా చెప్పుకు పోతున్నాడు ఆయన. మిగిలిన శ్రోతలు ఇద్దరూ ఆ ప్రొలాంగ్డు హేమరింగ్ భరించలేక చల్లగా జారుకున్నారు.

ఆ కొత్తగా వచ్చిన పెద్దమనిషిమాత్రం వెంకట్రావు పక్కనే ఆశీను డయ్యాడు. పోయిన వాళ్ళు పోతే పోయారు- ఉన్నవాడు చాలు అనుకున్నాడేమో మళ్ళీ మొదలు పెట్టాడు వెంకట్రావు: "పెద్ద వాళ్ళపట్ల భయం, భక్తీ ఉండేవి మాకు. ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా మా నాన్న ఎదుట నోరెత్తడానికి భయపడే వాడిని నేను. మరి నా పుత్రుడికో ఇదేం పనిరా వెధవా! ఆడపిల్ల దూకమంటేమాత్రం మేడమీద నుండీ దూకుతావుట్రా అంటే ఏమన్నాడో తెలుసుటండీ! ఆ అమ్మాయి చెప్పింది కాబట్టి దూకానుగానీ ,నువ్వు బ్రతిమాలితేమాత్రం దూకుతానా, నాన్నా! అయినా నే చేసిందాన్లో తప్పేముంది? రాముల వారు శివధనస్సు విరవలేదూ! పార్థుడు మత్స్య యంత్రం కొట్టలేదూ. అసలు పూర్వకాలంలో రాజకుమార్తెలు ఫలానా రాకాసిని చంపిన వీరుడిని పెళ్ళాడుతాం! ఫలానా చెట్టు నరికిన శూరుడిని పెళ్ళాడుతాం అని పరీక్షలు పెట్టేవాళ్ళుట. వాళ్ళకోసం పోటీలు పడేవాళ్ళుట రాకుమారులు. వాళ్ళంతా చవట వెధవాయిలా' అంటూ వితండవాదం మొదలు పెట్టాడు. ఇకేం మాట్లాడతాను? నోరుమూసుకుని ఊరుకున్నాను. దిక్కుమాలిన రోజు లొచ్చి పడ్డాయి. పెద్దలు చెప్పటం, పిల్లలు వినటం పోయింది. పిల్ల వెధవలు 'ఉపన్యాసాలు ఇస్తున్నారు. మనం నోరెత్తకుండా వింటున్నాం" అంటూ ఆగాడు ఆయాసంగా.


"మహాగా సెలవిచ్చారు. రోజులే అలా ఉన్నయి. మరి ఏం చేస్తాం! నా కూతురూ అంతే! ఆడపిల్లకదా, వినయం సందనం ఉండద్దుటండీ! అదేమీ లేదు. మనం ఒక మాట అనటం భయం పది మాటలు అప్పజెప్తుంది. ఎవరైనా, ఏదైనా అంటే నువ్వు ఊరుకోరాదుటే అంటాను. వినదు. ఎంత వాడినైనా పట్టుకుని చెప్పుతో కొట్టినట్లు సమాధానం చెప్పటమే! అది ఎక్కడికైనా వెళ్ళుందంటే భయం నాకు. ఏ గొడవ సృష్టిస్తుందో అని భయపడుతూనే ఉంటాను" అంటూ తన బాధ వెళ్ళబోసుకున్నాడు ఆ రెండో ఆయన.

వీళ్ళు ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే మోహన్, రోజీ హాస్పటల్‌కి వచ్చారు. ఇతని దగ్గరికి రాగానే ఆగిపోయారు. వెంకట్రావుకి నమస్కారం పెట్టాడు మోహన్. "సారీ,అండీ! నా పెళ్ళికి వచ్చిన సమయంలో ఈ ఆక్సిడెంట్ జరగటం నాకు చాలా బాధగా ఉంది" అన్నాడు బాధపడుతూ.

"ఇందులో నీ తప్పేముంది, నాయనా? నువ్వు బాధపడకు" అని ఓదార్చాడు ఆయన. తల వంచుకుని మోహన్ పక్కన నిలబడిన రోజీ తల ఎత్తి చూసింది. "అరే... పెద్ద నాన్నా! మీరిక్కడున్నారేం?" అని అడిగింది ఆశ్చర్యంగా. "అబ్బాయిని చూసి వెళ్దామని వచ్చానమ్మా!" అన్నాడాయన.

అయోమయంగా చూశాడు వెంకట్రావు. "ఎవరమ్మా ఈయన? నీకు తెలుసా?" అని అడిగాడు. "వీరు మా పెద్దనాన్నగారు. గాయిత్రి తండ్రి!" అంది రోజీ. "గాయిత్రి అంటే?" అనుమానంగా అడిగాడాయన.

"అదేనండీ... మీ అబ్బాయిని మేడమీదినించి దూకమన్నదే- ఆ గడుగ్గాయి-అది నాకూతురు, నా పేరు గంగాధరం. తమరితో మాట్లాడుదామని ఇలా వచ్చాను. తమరు నా కూతురిని మన్నించాలి. నన్నూ మన్నించాలి" అన్నాడు చేతులు జోడించి. "సరే లెండి మీరేం చేస్తారు మధ్యలో. మన బంగారం మంచిదైతే ,కంసాలి ఏంచేస్తాడు అన్నట్లు నా కొడుక్కి బుద్ధి ఉండాలిగానీ... ఎవర్నని ఏం లాభం? సరే జరిగింది ఏదో జరిగిపోయింది అని ఊరుకుందామంటే వీల్లేదుట. మీ






అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాడుట. పెళ్ళికి ముందే నిన్ను కోతిలా ఆడిస్తోందే! ఇక ఆ అమ్మాయిని కట్టుకుని ఏం సుఖపడతావురా అని ఎంత చెప్పినా వింటేనా?" అన్నాడు వెంకట్రావు.

"నేనూ ఆ మాటే చెప్పానండీ నా కూతురితో. అబ్బాయిది బాగా తొందరపాటు స్వభావంలా ఉందమ్మా! కాస్త ముందూ, వెనకా ఆలోచించు అని శత విధాలా చెప్పాను. ఊహుఁ... పెళ్ళంటూ చేసుకుంటే అతన్నే చేసుకుంటాను. లేకపోతే అసలు నాకు పెళ్ళే వద్దు అని మొండికి వేసుకుని కూర్చుంది. ఇక గత్యంతరంలేక... ఇదుగో తమరి దగ్గరికి వచ్చాను. ఇక తమ ఇష్టం" అంటూ తను వచ్చిన పని చెప్పాడు.

"అయ్యా గంగాధరంగారూ! నా ఇష్టం ఏముంది ఇందులో, మీ ఇష్టం, నా ఇష్టం ఏమీ లేదు. అంతా వాళ్ళిష్టం. మనంతవాళ్ళు వాళ్ళయాక వాళ్ళ మాటకు ఎదురు చెప్పి పరువు పోగొట్టుకునే కంటే సరేనని పెద్దరికం నిలుపుకోవటం ఉత్తమం. మావాడికి మీ అమ్మాయి నచ్చింది. మీ అమ్మాయికి మా వాడు నచ్చాడు. మనకూ శ్రమ తగ్గించారు. కానీండి. ఇదీ మంచిదే" అన్నాడు వెంకట్రావు.

గంగాధరంగారి ముఖం చాటంత అయింది. "బావగారి మనసు అమృతం. మంచి శోభన్కరమైన మాట శెలవిచ్చారు. ఇక ఇచ్చి పుచ్చుకోవడాలు మాట్లాడుకుంటే..." అన్నాడు ఆనందంగా.

"సరేలెండి. ఈ స్వయంవరం పెళ్ళికి ఇచ్చి పుచ్చుకోవడా లొక్కటే తక్కువ. కట్నం అదీ ఏం వద్దు లెండి. మీ అమ్మాయికి మీ రేం ఇచ్చుకుంటారో మీ ఇష్టం. ఇవ్వకపోయినా, ఏమీ ఫరవాలేదు లెండి. ఈ వీరాధి వీరుడికి మంచి ఉద్యోగమే ఉంది. భార్యని బాగానే చూసుకుంటాడు" అన్నాడు వెంకట్రావు.

గంగాధరం ఆనందం అవధులు దాటింది. "తంతే గారెల బుట్టలో పడటం అంటారే అలా ఉంది నా పని. ఇదంతా నా పూర్వజన్మ సుకృతం. నా కూతురి అదృష్టం. మీరు వద్దన్నారని ఊరుకోను. నా శక్తివంచన లేకుండా కానుకలిచ్చి పెళ్ళిచేస్తాను. మరి ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందాం?" అన్నాడు ఆనందాభీష్టాలతో.

"మా అబ్బాయి ఆరు వారాలు మంచంలో ఉండాలిట. అప్పటికి శ్రావణం వచ్చేస్తుందిగా. బోలెడు ముహూర్తాలు."

అప్పటిదాకా నోరు ఆవలించి వీళ్ళ సంభాషణ వింటున్న మోహన్ ఈ లోకంలోకి వచ్చి ఒక్క పరుగున లోపలికి వచ్చాడు. "కంగ్రాట్యులేషన్స్‌రా, మాధవ్, హార్టీ కంగ్రాట్యులేషన్స్" అన్నాడు మంచం దగ్గరికి వెళ్తూ. అక్కడున్న వాళ్ళంతా మొహామొహాలు చూసుకున్నారు.

"ఆనందంలో మరీ ఒళ్ళు తెలీటం లేదేమిట్రా, కొత్త పెళ్ళికుమారుడా! ఓ వక్క వాడు కాలు విరిగి ఏడుస్తుంటే నీ కంగ్రాట్యులేషన్స్ ఏమిటి?" అన్నాడు ఒక ఫ్రెండ్.

"నర్లేవోయ్! కాలు విరగటం పాత న్యూసు. ఈ ప్రబుద్ధుడి పంట పండింది. ఎవరికోసం అయితే ఇంత సాహసం చేశాడో ఆ కన్యామణిగారు వీడిని కనికరించారు" అన్నాడు మోహన్.

"నాయనా! నువ్వు రచయితవని తెలుసు మాకు. నువ్వు రచించిన ఇరవై రెండు కథల్లో ఇరవై తిరిగొచ్చిన సంగతి కూడా తెలుసు. బోర్ కొట్టించక అసలు విషయం ఏమిటో సూటిగా చెప్పు" అని విసుక్కున్నాడు మురళి.

గతుక్కుమన్నా, వెంటనే సర్దుకున్నాడు మోహన్. "ఇదుగో చెప్తున్నాను. గాయిత్రి తండ్రి వచ్చి వీళ్ళ నాన్నగారిని కలుసుకున్నారు. గాయిత్రి వీడిని తప్ప మరొకడిని పెళ్ళిచేసుకోనని మొండికి వేసుకుని కూర్చుందిట. వీళ్ళ నాన్నగారూ సరే అన్నారు. వీడికి కట్టు విప్పగానే పెళ్ళి చేస్తారుట" అంటూ అసలు విషయం చెప్పేశాడు. కుతూహలంగా వింటున్న మాధవ్ ఆనందం పట్టలేక కెవ్వున అరుస్తూ మంచంమీదనుండి కిందికి దూకి బాధతో కెవ్వుమన్నాడు.

ఆపరేషన్ థియేటర్‌లోనించి స్ట్రెచర్ మీద తీసుకొచ్చి జాగ్రర్తగా బెడ్ మీద పడుకోబెట్టారు మాధవ్‌ని. అతనికి తెలివి వచ్చేదాకా పక్కనే కూర్చున్నాడు డాక్టరు. తెలివిరాగానే కళ్ళు విప్పిన అతనికి మొదట కనిపించాడు తండ్రి. "నీ కిదేం పోయేకాలంరా! ఏం... మతిగానీ పోయిందా?" అంటూ విరుచుకుపడ్డాడు.

"శాంతించండి, బావగారూ! ఉడుకురక్తం" అంటూ చెయ్యి పట్టుకుని బయటికి తీసుకు వెళ్ళాడు గంగాధరం.

"చూడబ్బాయ్, మాధవరావ్! చదువుకున్న వాడివి... నీ కన్నీ తెలుసు. అయినా, నా ధర్మం కాబట్టి చెప్తున్నాను. నిన్న విరిగిన ఎముక సెట్‌చేసి కట్టుకట్టాను. మళ్ళీ ఈ పూట మంచం మీదనించి దూకావుట. బోన్ డిస్‌లొకేట్ అయింది. మళ్ళీ సెట్‌చేసి ప్లాస్టరు వేసేశాను. ఇప్పటికి ఏమీ ప్రమాదంలేదు, కానీ నువ్విలా మరోసారి దూకి ఎముక తొలిగిందంటే ఇక నీ కాలు విరిచి పొయ్యిలో పెట్టడానికి తప్ప మరో సత్కార్యానికి ఉపయోగపడదు. కాబట్టి కాస్త జాగర్తగా ఉండు" అంటూ వార్నింగ్ ఇచ్చి వెళ్ళిపోయాడు డాక్టరు.

"అమ్మా, అయ్యో!" అంటూ మూలుగుతున్న మాధవ్‌ని చూస్తే జాలివెయ్యలేదు ఎవరికీ. పైగా కోపం వచ్చింది. "చాల్లే- చేసిన నిర్వాకం చాలక మూలగటం కూడానూ! నోరుమూసుకుని పడుకో" అని కసిరారు.

కుయ్యో, మొర్రో" మంటున్న మాధవ్ హఠాత్తుగా నోరు మూసేసుకున్నాడు. కళ్ళు పెద్దవి చేసి గుమ్మం వైపు చూస్తూ ఉండిపోయాడు. చేతిలోని పూల గుత్తితో కంగారుగా లోపలికి వచ్చింది గాయిత్రి. "ఏమిటీ? ఇంకా నెప్పి తగ్గలా? నిన్న పొద్దున్న అనగా ప్లాస్టర్ వేస్తే ఇంకా పెయిన్ తగ్గకపోవటం ఏమిటీ? ఎవరా డాక్టరు? ఇటు పిలవండి నేను కనుక్కుంటాను. అసలు సరిగా సెట్ చేశారా?" అంది ఆవేశంగా.

"అమ్మా! లక్షణంగా సెట్ చేశాం. కానీ, ఈయన పొద్దున పదింటికి మళ్ళీ మంచం మీదినించి దూకారు కాబట్టి మళ్ళీ సెట్ చేసి ప్లాస్టర్ వెయ్యాల్సి వచ్చింది. ఇందాకే తీసుకొచ్చి పడుకోబెట్టారు. ఇంతకు ముందే తెలివి వచ్చింది "అంటూ కేసు హిస్టరీ చెప్పింది నర్స్.

"ఏమిటీ... మళ్ళీ మంచం మీదనుండి దూకారా! ఎందుకు దూకారు? ఎవరు దూకమన్నారు?" అందంగా ఉన్న నర్స్ వంక అనుమానంగా చూస్తూ ఆవేశంగా ఆక్రోశించింది గాయిత్రి.

కంగారుపడిపోయాడు మాధవ్. "అబ్బే అదేంలేదు. నువ్వు అనవసరంగా అపోహపడుతున్నావ్" అంటూ నచ్చచెప్పబోయి నెప్పిగా ఉండటంవల్ల చెప్పలేక కుయ్యోమని మూలిగాడు.

"మరేంలేదండీ! మీరు వాడిని పెళ్ళి చేసుకుంటారని తెలియగానే ఆనందం పట్టలేక దూకేశాడండీ!" అంటూ చెప్పేడు మోహన్.

"ఓ!" అంటూ సిగ్గుగా నవ్వింది గాయిత్రి.

మెల్లిగా ఒక్కరొక్కరే బయటికి వెళ్ళిపోయారు. అందరూ వెళ్ళేదాకా ఆగి అతని మంచం పక్కనున్న బల్లమీద కూర్చుంది గాయిత్రి. "బాగా బాధగా ఉందా?" అంటూ అతని నుదుటి మీద చెయ్యి వేసింది. బాధ మాట దేవు డెరుగు. ఆనందం, ఉత్సాహం పట్టలేక మళ్ళీ మంచంమీద నుంచి దూకబోయిన మాధవ్ డాక్టర్ వార్నింగ్ గుర్తురావటంతో మానేసి- "ఇందాక బాధగా ఉండేది. నీ చెయ్యి పడగానే ఎగిరిపోయింది" అన్నాడు హుషారుగా. ●

